
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 2 డిసెంబరు 2024

అంతా రామమయం..

- రామకొండకు పోటెత్తిన భక్తులు
- ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

కోయిలకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ రామకొండ ఆదివారం రామనామస్మరణతో మార్మోగింది. అమావాస్య సందర్భంగా భక్తులు వేలాదిగా తరలొచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీరామకొండకు చేరుకున్నారు. తెల్లవారు జామున రెండు గంటల నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు కోనేట్లోని నీరు, కొండపై ఉన్న వనమూలికలను తీసుకెళ్లారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రామకొండ ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.రవీందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రతంగ్ పాండురెడ్డి, నారాయణపేట బీజేపీ అధ్యక్షుడు శ్రీనువాసులు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఇన్‌సెట్లో ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

గుట్టపైకి బారులు తీరిన భక్తులు

ఆసియా ఖండంలోనే అద్భుతం

- శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

దోమలపెంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం ఆసియా ఖండంలోనే అద్భుతమని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఆమె అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. వీరికి సీఈ రామసుబ్బారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నాలుగేళ్ల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంగురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కేంద్రం పనితీరును సీఈ మంత్రికి వివరించారు. అనంతరం భూగర్భ కేంద్రంలో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇంజనీర్లతో సమావేశం అయ్యారు. మంత్రి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేస్తున్నందునే నేడు రాష్ట్రంలో కరెంటు కోతలు లేకుండా 24 గంటల నిరంతరాయంగా సరఫరా అవుతోందన్నారు. పది సంవత్సరాలుగా తమకు సాధారణ బదిలీలు కావడం లేదని ఇంజనీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రాన్ని అందించారు. సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇంజనీర్లు, ఉద్యోగులు, స్థానిక నాయకులు ఉన్నారు.



మంత్రి సీతక్కకు విద్యుత్ కేంద్రం పనితీరును వివరిస్తున్న జెన్‌కో ఇంజనీర్లు

బియ్యమూ.. అమ్మేస్తున్నారు..

నిల్వ చేసిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న గోదాం సిబ్బంది

- మహబూబ్‌నగర్‌లో 680 మెట్రిక్ టన్నుల బియ్యం మాయం
- రేషన్ షాపులకు ప్రతీ నెల తక్కువ తూకంతో సరఫరా
- పలువురు లబ్ధిదారులకు రైస్ ఇవ్వకుండా షాపు వద్దే డబ్బులిస్తున్న డీలర్లు..
- దాంతో షాపులకు రాని సరకు
- స్టాక్ లేకపోవడంతో మధ్యాహ్న భోజనానికి పాత బియ్యం సరఫరా



మహబూబ్‌నగర్‌లోని బియ్యం నిల్వలు మాయమైన ఎస్‌డబ్ల్యూసీ గోదాం

మహబూబ్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పౌరసరఫరాల శాఖలో ప్రభుత్వ సొమ్ము దోపిడీ ఆగడం లేదు. రైస్‌మిల్లర్లు, అధికారులు, రవాణా కాంట్రాక్టర్లు, రేషన్ డీలరు.. ఇలా ప్రతీ ఒక్కరు తమకు అందినకాడికి దోచుకుంటూనే ఉన్నారు. తాజాగా ఈ పౌరసరఫరాల బియ్యానికి సంబంధించిన మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రైస్‌మిల్లర్లు ఇచ్చిన బియ్యాన్ని నిల్వ చేసే గోదాముల నుంచి భారీగా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ, వేర్ హౌజింగ్ కార్పొరేషన్ అధికారులు కుమ్మక్కు కావడంతో విషయం బయటకు పొక్కడం లేదు. కొత్త అధికారులు వచ్చిన సందర్భాల్లో



మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ జడ్పీ పాఠశాలలో పురుగులు పట్టిన బియ్యం

కొన్ని బయటపడుతుండగా మరికొన్నింటిని తొక్కిపెడుతున్నారు. ప్రతీఏట ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఖర్చుతో రైతుల నుంచి ధాన్యం సేకరిస్తోంది. దాన్ని మిల్లర్లకు ఇస్తే వారు సీఎంఆర్ చేసి పౌరసరఫరాల శాఖకు అప్పగించాల్సిన విషయం తెలిసిందే. ఆ అప్పగించిన బియ్యాన్ని సివిల్ సప్లయిస్, ఏఎంసీ, స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ గోదాముల్లో నిల్వ ఉంచుతారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాకు డీడీ సొమ్ము చెల్లించిన తర్వాత ఆర్‌వో (రిలీజింగ్ ఆర్డర్) ఇస్తారు. వాటిని గోదాముల వద్ద ఇస్తే ఆ మేరకు స్టాక్ వేసి పంపాల్సిన బాధ్యత గోదాం ఇన్‌చార్జిలకు ఉంటుంది. కానీ, పలుచోట్ల గోదాం ఇన్‌చార్జిలు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బియ్యాన్ని కొద్దికొద్దిగా మాయం చేస్తున్నారు. వేలాది మెట్రిక్ టన్నుల బియ్యం

(మిగతా 6లో..)

జల సంరక్షణే లక్ష్యంగా

ఉపాధి

- భూగర్భ జలాల పెంపునకు జలనిధి పథకం
- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

6

గోవింద నామస్మరణతో మార్మోగిన గిరులు



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

7

పేరుకే పెద్దాసుపత్రి

- 300 మంది జీతంలో ప్రతీనెల రూ. 1500 కోత
- ఆరు నెలలుగా అరకొర మందుల సరఫరా
- జెన్‌కో ఉద్యోగులకు అందుబాటులో లేని నెలవారి మందులు
- పట్టించుకోని యాజమాన్యం

7

రగ్బీ చాంపియన్ మహబూబ్‌నగర్

- రన్నర్ రంగారెడ్డి, నల్గొండ
- మూడో స్థానంలో నిలిచిన మెదక్

రన్నర్ రంగారెడ్డి, నల్గొండ
మూడో స్థానంలో నిలిచిన మెదక్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల, బాలికల రగ్బీ టోర్నీలో రెండు విభాగాల్లో మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో నల్గొండపై మహబూబ్‌నగర్ జట్టు 2-1 తేడాతో, బాలికల విభాగంలో రంగారెడ్డిపై మహబూబ్‌నగర్ జట్టు 2-0 స్కోర్ తేడాతో గెలుపొందాయి. బాలుర విభాగంలో నల్గొండ, బాలికల విభాగంలో రంగారెడ్డి జట్లు రన్నర్ నిలిచాయి. మూడో స్థానంలో బాల ,బాలికల విభాగంలో మెదక్ జట్లు నిలిచాయి. విజేతలకు ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.



బాలికల విభాగం చాంపియన్ మహబూబ్‌నగర్ జట్టుకు షీల్డ్ అందిస్తున్న నిర్వాహకులు

గెలుపు, ఓటములు సహజం : ఏఎంవో దుంకుడు శ్రీనివాస్

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమాని, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. చదువుతో పాటు

(మిగతా 6లో..)

కబడ్డీకి ఆదరణ

- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్
- విజేత జట్టు గద్వాల బాలుర ఉన్నత పాఠశాల

గద్వాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడ అయిన కబడ్డీకి మంచి ఆదరణ ఉందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పీ జితేందర్ అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-12 జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు జితేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు గ్రామీణ స్థాయి నుంచి ప్రోకబడ్డీ స్థాయికి ఎదిగే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాలన్నారు. అలాగే విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి కోచ్‌లు ఇచ్చే సలహాలు, సూచనలను పాటించాలన్నారు. పోటీల్లో 12 జట్లు పాల్గొనగా విజేతగా గద్వాల బాలుర ఉన్నత పాఠశాల జట్టు, ద్వితీయ స్థానంలో ఇండోర్ స్టేడియం జట్టు, తృతీయ స్థానంలో గద్వాల శారద స్కూల్ జట్లు నిలిచాయి. పోటీల్లో బెస్ట్ రైడర్‌గా యువరాజు, బెస్ట్ డిఫెండర్‌గా జయకృష్ణలు షీల్డ్‌లను అందుకున్నారు. కార్యక్రమంలో కబడ్డీ కోచ్ మహేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, సీపీఐ నాయకుడు అంజనేయులు ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్

సీనియర్ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక ఆదివారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికల కోసం జిల్లా వ్యాప్తంగా 55 మంది క్రీడాకారులు హాజరయ్యా రు. 12 మంది బాలికలను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాము, ఆర్గ నైజింగ్ సెక్రటరీ కురుమయ్య తెలిపారు. జిల్లాస్థాయి సీనియర్ బాలికల కబడ్డీ జట్టుగా ఎంపికైన వీరంతా త్వరలో రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. లక్ష్మి, అనూష, చిట్టెమ్మ, శాంతమ్మ, శ్రీవాణి, తులసి, పద్మ, వెన్నెల, శిరీష, నిర్మల, హారిక, ప్రవళిక, మానస, లక్ష్మి, ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సుధీర్ కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు వేణుగోపాల్, వెంకట రాములు, బాబు, పీడీ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలు

పత్తి కొనుగోలు బంద్

- మిల్లుల్లో స్థలం లేక ఐదు రోజులు విరామం



కాటన్‌మిల్లుల్లో భారీగా పేరుకుపోయిన పత్తి

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు పత్తికొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు సెక్రటరీ ఎల్లస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒకటే కొనుగోలు కేంద్రం ఉండటం వల్ల రోజు పరిమితికి మించి రైతులు వస్తున్నారు. దీని వల్ల మిల్లు సామర్థ్యాన్ని మించి కాటన్ రావడంతో మిల్లులో పత్తి నిండిపోయిందని అన్నారు. దీంతో అయిదు రోజుల పాటు కొనుగోలు నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి తొమ్మిదో తేదీన కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని తెలిపారు. టోకెన్లు ఇవ్వాలా వద్దా అనేదానిపై కమిటీలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోనున్నట్లు అయన పేర్కొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బాల బ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారు

ఆలయాల్లో కార్తీక సందడి

- కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు
- అలంపూరు ఆలయాల ప్రాంగణంలో దీపాలు వెలిగించిన మహిళలు

6

పల్లె దవాఖానాలపై పట్టింపేది..?

- నిర్మాణం పూర్తయినా నిరుపయోగమే
- లక్షలు వెచ్చించినా లక్ష్యం నెరవేరటం లేదు



చిన్నతాండ్రపాడులో అసంపూర్తిగా పల్లెదవాఖాన భవనం

అయిజ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పల్లె దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వైద్య, ఆరోగ్య శాఖ 2021 సంవత్సరంలో ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానా(వెల్‌నెస్ సెంటర్ల)లుగా మార్చింది. వాటికి తగినట్లుగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ భవనాలను ఏర్పాటు చేయలేకపోయింది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 13 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీలు ఉన్నాయి. జిల్లా మొత్తంగా 6లక్షల 50వేల జనాభా ఉంది. మండల కేంద్రాల్లో మాత్రమే కొంతమేర వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతీ మూడు వేల జనాభాకు ఒక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లాలో 10 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 91 ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో 64 ఉప కేంద్రాలను పల్లెదవాఖానాలుగా గుర్తింపునిచ్చి భవనాలు నిర్మించాలని భావించారు. జిల్లా మొత్తం 57 భవనాల నిర్మాణం కోసం ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికి 30 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులో 12 భవనాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. మిగతా 18 భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. అయిజ మండలంలోని టీటీదొడ్డి గ్రామంలో ఇప్పటి వరకు స్థల గుర్తింపు జరగలేదు. ఫర్దీపూర్, అయిజ ఎస్సీ కాలనీ, మల్దకల్ మండలంలోని తాటికుంట గ్రామంలో, ధరూర్ మండలంలోని ద్యాగదొడ్డి, రాజోళి మండలంలోని పెద్దధన్వాడలో భవన నిర్మాణపు పనులు ప్రారంభించలేదు. మిగతా మంజూరు అయిన 21 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన భవనాలనైనా ఉపయోగంలోకి తీసుకురావాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



అయిజ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వేచిఉన్న ప్రజలు

ఉపయోగంలోకి తీసుకువస్తాం



పల్లె దవాఖానాలు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని కొనసాగుతున్నాయి. నిర్మాణాలు ప్రారంభం కాని ప్రాంతాల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. నిర్మాణాలు పూర్తయిన భవనాలు వీలైనంత త్వరగా ప్రారంభించి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- సిద్దప్ప, జిల్లా వైద్య అధికారి

ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా
హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూవిస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఐటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించిట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతోపాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో
రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

రగ్బీ చాంపియన్
మహబూబ్‌నగర్

(మొదటి పేజీ తరువాయి)

క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటికే మూడు రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించరని గుర్తు చేశారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకులు కిష్టయ్య, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, టోర్నీ కార్యదర్శి నిరంజన్‌రావు, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయమ ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, బాల్‌రాజ్, వడెన్న, పరశురాం పాల్గొన్నారు.

మళ్లీ తెగిన డీ-82 కాలువ

వెల్దండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేఎల్‌ఐ డీ-82 కాలువ మళ్లీ తెగింది. రెండు రోజుల్లో కాలువ తెగడం రెండోసారి. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూర్ వద్ద కాలువకు గండిపడిన సంఘటన మరువకముందే తాజాగా ఆదివారం గుండాల గ్రామ సమీపంలో మళ్లీ తెగిపోయింది. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. రబీసీజన్‌లో కాలువకు సమీపంలోని పోతేపల్లి, అల్లంతోటబావి తండా, వెల్దండ, గుండాల, చొక్కన్నపల్లి, చెర్కూర్, బర్కత్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు పెద్దఎత్తున వేరు శనగ పంట సాగుచేశారు. దీనికి తోడు ప్రస్తుత సీజన్‌లో వరిసాగుకు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రెండేళ్లుగా కాలువ ప్రతియేట ఎక్కడో ఒకచోట తెగుతూనే ఉంది. మండలంలో ఇప్పటికే పదిసార్లు కాలువ తెగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాగునీరు వృథాగాపోయి సాగు ప్రశ్నార్థకంగా మారింది. గండి పడినచోట నారుమళ్లు, వేరుశనగ, పత్తిచేలు కొట్టుకునిపోయిన సందర్భాలు ఉన్నాయి. నాసిరకంగా పనులు చేయడంతో కాలువగట్లు తెగిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు చొరవతీసుకుని కాలువ గండిని పూడ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

జలసంరక్షణే లక్ష్యంగా
'ఉపాధి'

- వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు
- జలనిధి పేరుతో ఉపాధి హామీ పథకంలో భూగర్భ జలాల పెంపుపై దృష్టి



అయిజలో అలుగుపారుతున్న చెక్‌డ్యాం

అయిజ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ నీటి వనియోగం పెరుగుతుండడంతో భూగర్భజలం అడుగంటి పోతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జలనిధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నీటి వనరులను పొదుపుగా ఉపయోగించుకోవడం, సంరక్షణ పనులకు ప్రాధాన్యతను ఇస్తున్నది. వచ్చే ఏడాది నుంచి జల సంరక్షణ పనులు చేపట్టేందుకు, పనుల గుర్తింపునకు రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.



సింధనూర్‌లో చేతిపంపు వద్ద నిర్మించిన ఇంకుడుగుంత

క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపు..

2025-26 సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పనులలో జల వనరులకు, జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తిస్తున్నారు. అందుకు సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. డిసెంబరు ఆఖరులోపు పనుల గుర్తించేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో మూడు లక్షల 32వేల మంది జాతీయ ఉపాధిహామీ కూలీలుగా నమోదయ్యారు. జీవనోపాధిగా కూలీలకు పనులు కల్పించాల్సి ఉంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన పనులు ఆ సంవత్సరంలోపే పూర్తి చేయాలన్న నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో పనుల గుర్తింపు, ప్రణాళికలపై పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నారు.

జలనిధి కింద చేయాల్సిన పనులు

జలనిధి పథకంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఇంటిపై భాగంలో కురిసిన వర్షం నీటిని భూమిలోకి వెళ్లేలా నిర్మాణాలు చేయటం, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాలు ఏర్పాటు చేయటం, వాగులు, వంకలపై చెక్‌డ్యాంల నిర్మాణం అనుకూలమైన ప్రాంతాలలో చిన్న కుంటల నిర్మాణాలు చేయటం, పంట పొలాలు, వాగులు, వంకలు, నీటి నిల్వ గుంతలపై దృష్టి సారించింది. సింగిల్ ఫేజ్ మోటర్లు, చేతిపంపుల వద్ద, ఇళ్లల్లోనూ ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టేందుకు దృష్టి సారించింది. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పనులను గుర్తిస్తున్నాం..



భూగర్భజలాల పెంపునకు ఈ పను లు తోడ్పడుతాయి. కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తిస్తున్నాము. వర్షపు నీటిని ఒడిసి పట్టి, భూగర్భంలోకి వెళ్లే విధంగా చర్యలు చేపడతాము. నీటి వృథాను అరికట్టేందుకు చేతి పంపులు, ఇళ్లలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు కృషి చే స్తాము. అందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకారం అందించాల్సి ఉంది.

- నర్సింగరావు, డీఆర్‌డీవో

బియ్యమూ
అమ్మేస్తున్నారు..

(మొదటి పేజీ తరువాయి)

నిల్వలు ఉండటంతో ఈ కొద్దికొద్దిగా మాయం అవుతున్న నిల్వలపై పెద్దగా పట్టింపు ఉండటం లేదు. ఇందుకు ఆ గోదాముల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని వాడుకుంటున్నారు. ఈ రకంగా రూ. కోట్ల విలువ చేసే ధాన్యం పక్కదారి పడుతోంది. ప్రస్తుతం సరళీకృత విధానం వల్ల ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు కూడా బియ్యం సరఫరా చేసుకోవాల్సి వస్తోంది. నాలుగు నెలలుగా మహబూబ్‌నగర్ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి ఇండెంట్ పెట్టి బియ్యం దిగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో ఏదో ఒక స్టాక్ చూపించి తేడాలు కనిపించకుండా మేనేజ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతీసారి మిల్లుల్లో ధాన్యం అమ్మకాల్లో తేడాలపై తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ గోదాముల్లో బియ్యం నిల్వలపైనా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

680 మెట్రిక్ టన్నులు మాయం..

ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలోని చిన్నదర్పల్లి వేర్ హౌజింగ్ కార్పొరేషన్ గోదాంలో దాదాపు 680 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. రిలీజ్ ఆర్డర్ తీసుకొని వెళ్లిన వారికి స్టాక్ లేదని చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇంతమొత్తం బియ్యం గోదాం నుంచి మాయం కావడం సాధారణ విషయమేమీ కాదు. ఎప్పటి నుంచో జరుగుతూ ఇప్పుడు తనిఖీల్లో తేడాలు రావడం వల్ల బహిర్గతమై ఉండాలి. పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖ, స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ సమన్వయంతోనే ఈ దోపిడీ జరుగుతోందని చెప్పవచ్చు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఆ గోదాములను పరిశీలించి అక్కడి మేనేజర్ ప్రవీణ్‌ను వివరణ కూడా కోరింది. కానీ, వేరే స్టాక్ చూపించి ఎలాంటి తేడాలు లేవని ప్రవీణ్ బుకాయించే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఈ తేడాలను గమనించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కమిషనర్‌కు రిపోర్టు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం ఇది మహబూబ్‌నగర్ జిల్లాకే పరిమితం కాదు.. వనపర్తి జిల్లాలోని గోదాముల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నదని తెలుస్తోంది. మదనాపూర్‌లో ఉండే గోదాముల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఈ బియ్యం అక్రమ దందాతోనే రూ. కోట్లకు పడగలెత్తారు.

తక్కువ తూకం.. మిగులు అమ్మకం...

ప్రజాపంపిణీ కోసం రేషన్ బియ్యాన్ని 50 కిలోల బస్తాల ద్వారా సరఫరా చేస్తారు. అయితే అంతే తూకం లేదా ఒక కిలో అటు ఇటుగా బియ్యం తూకం రావాలి. కానీ, ఒక్కో సంచిలో 5 నుంచి 7 కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రతీనెల 15,057 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. అంటే దాదాపు 1.50 లక్షల క్వింటాళ్లు అన్నమాట. దాదాపు 3 లక్షల బస్తాల్లో ఈ సరఫరా గోదాముల నుంచి జరగాలి. ఒక్కో బస్తాకు కనీసం మూడు కిలోల తూకం తక్కువగా వచ్చినా ప్రతీనెల 903 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు తక్కువగా వెళుతుందని చెప్పవచ్చు. వీటిపై కొందరు డీలర్లు ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నా పట్టింపు ఉండటం లేదు. గోదాముల వద్ద ఈ తూకం అలాగే వస్తోంది. అయితే రైస్‌మిల్లర్ల నుంచి లేదా గోదాముల నుంచి ఈ తక్కువ తూకం బస్తాలు రావాల్సి ఉంటుంది. అలాగే రేషన్ డీలర్లు కూడా తమ దుకాణాల వద్దే లబ్ధిదారులకు డబ్బులు చెల్లించి బియ్యం ఇవ్వకపోవడంతో ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి స్టాక్ తీసుకోవాల్సిన అవసరం ఉండటం లేదు. దాన్ని రైస్‌మిల్లర్ల నుంచి వచ్చిన సీఎంఆర్‌గా చూపడమో, గోదాముల నిర్వాహకులతో అమ్ముకోవడమో చేస్తున్నారు. అన్ని బియ్యం గోదాముల్లో స్టాక్ లెక్కలను చూస్తే తేడాలు తెలుస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆలయాల్లో కార్తీక సందడి

- అలంపూరు ఆలయాల ముందు దీపాలు వెలిగించిన మహిళలు
- జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ ఐజీ త్రివిక్రమ్ వర్మ



స్వామి అమ్మవారి కల్యాణం చేస్తున్న అర్చకులు

అలంపూరు/ఉండవల్లి/ధరూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరిరోజు ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఐదో శక్తిపీఠం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కిక్కిరిసి పోయారు. ముందుగా తుంగ భద్ర నది పుష్కరఘాట్‌లో స్నానమాచరించి నదిలో దీపాలను వదిలి, స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శదర్శనం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి చీరలు, గాజులు, వడిబియ్యం, త్రిశతి ఖడ్గమాలలను మొక్కులు చెల్లించారు. మహిళలు ఉభయ ఆలయాల ముందు కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిల కించారు. ఆంధ్రప్రదేశ్ ఐజీ త్రివిక్రమ్ వర్మ జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో పురేంధర్‌కుమార్ స్వాగతం పలికారు. అదేవిధంగా ఉండవల్లి మండల కేంద్రంతో పాటు కంచుపాడు, తక్కశీల, ప్రాగటూర్, మారమునగాల, బైరాపురం, బస్వాపురం తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం స్వామి వారికి ఆకు పూజ, తులసీ దళ అర్చన చేశారు. ధరూరు మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థాని కులే కాకుండా రాయచూర్, మక్తల్, గద్వాల తదితర ప్రాం తాల భక్తులు స్వామి వారిని దర్శిం చుకున్నారు.



అలంపూరులో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పాగుంట వెంకన్న కల్యాణం

కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురంలోని పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా జరిపించారు. వేకువజామునే స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అలంకరిం చారు. అనంతరం భక్తుల సమక్షంలో స్వామి, అమ్మవారి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించడానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల భక్తులు హాజరయ్యారు.



ప్రత్యేక అలంకరణలో డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి

4న జాతీయ సాధన సర్వే పరీక్షలు

అభ్యసన సామర్థ్యం అంచనా కోసం ...

3, 6, 9 తరగతుల విద్యార్థులకే ..



కోటకొండ పాఠశాలలో మోడల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

నారాయణపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష దేశవ్యాపంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నారు. ప్రతి నాలుగేళ్లకోసారి కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, నాణ్యత, అభ్యాసన ఫలితాలను గమనించేందుకు ఈ సర్వే చేస్తారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 3,6,9 తరగతుల విద్యార్థులకు న్యాస్ పరీక్షలు 4న నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడవ తరగతిలో 8675 మంది విద్యార్థులు, ఆరవ తరగతిలో 9384 మంది విద్యార్థులు, తొమ్మిదవ తరగతిలో 8825 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే పరీక్షకు ఒకరోజు ముందు ఎంపిక చేసి జిల్లాలో మూడవ తరగతి విద్యార్థులు 998 మందికి 31 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఆరవ తరగతి విద్యార్థులు 1255 మందికి 27 పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిదవ తరగతి విద్యార్థులు 1983 మందికి 34 పాఠశా లల్లో పరీక్షలు నిర్వహిస్తారు. అయితే, ప్రస్తుతం న్యాస్ సర్వే పరీక్ష మూడవ తరగ తిలో భాష, గణితం, పరిసరాల విజ్ఞానం, ఆరవ తరగతిలో భాష, గణితం, పరిస రాల విజ్ఞానం తొమ్మిదవ తరగతిలో భాష, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం ఉండబోతుంది. ఎలాగైన మెరుగైన అభ్యాసన సామర్థ్యాలు విద్యార్థులు సా ధించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రాథమిక తరగతులకు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ పేరుతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు అభ్యాసనా భివృద్ధి కార్యక్రమం అమలు చేస్తూ ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే న్యాస్ సంసిద్ధతలో భాగంగా మూడు సార్లు మోడల్ పరీక్షలు నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను సన్నద్ధం చేశాం



జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మూడు ప్రాక్టీస్ టెస్టుల పరీక్షలు నిర్వహించి, విద్యార్థులను సన్నద్ధం చేశాం. సర్వే కోసం ఎంపిక చేసిన పాఠశాల వివరాలు ఒకరోజు ముందు తెలియజేయపడుతాయి. కాబట్టి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు చక్కని ప్రదర్శన ప్రదర్శించాలి.

- విద్యాసాగర్, జిల్లా సెక్టోరియల్ అధికారి, నారాయణపేట

పేరుకే పెద్దాసుపత్రి





ఈగలపెంట జెన్‌కో ఆసుపత్రి

- 300 మంది నెల జీతంలో ప్రతీ నెల రూ. 1500 కోత
- ఆరు నెలలుగా అరకొర మందుల సరఫరా
- జెన్‌కో ఉద్యోగులకు అందుబాటులో ఉంచని నెలవారి మందులు
- పట్టించుకోని యాజమాన్యం

మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం

మందుల కొరత ఉన్నది వాస్తవమే. జెన్‌కో ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

- రామసుబ్బారెడ్డి, ఈగలపెంట జెన్‌కో సీఈ

దోమలపెంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పని చేసే ఉద్యోగులకు హైదరాబాద్ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించేందుకు జెన్‌కో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఆరు నెలలుగా సక్రమంగా నెలవారి మందులు అందక పోవడంతో జెన్‌కో ఉద్యోగులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు.

స్థానికంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించక పోవడంతో తమకు ఏదైన ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తితే మహబూబ్‌నగర్, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఉద్యోగానికి సెలవు పెట్టక తప్పడం లేదని వారు వాపోతున్నారు. ఈగలపెంట జెన్‌కో సంస్థలో 300 మంది రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. అటెండర్ మొదలుకొని చీఫ్ ఇంజనీర్ వరకు ప్రతీ నెల వీరి జీతంలో రూ. 1500 కోత పడుతున్నది. మెడికల్ స్కీంలో ప్రతీ ఉద్యోగికి తన కుటుంబ సభ్యులకు వైద్యం అందించాల్సి ఉంది. ఇందులో కొందరు ఉద్యోగులు నెలకు ఒక్కసారి కూడా వైద్యం పొందకపోయినా జీతంలో కోత తప్పడం లేదంటున్నారు. మరి కొంతమంది బీపీ, షుగర్, థైరాయిడ్, ఆస్తమా మొదలగు జబ్బులు కలిగిన వారికి ప్రతీ నెల వారి మందులు సరఫరా చేయకుండా రెండు నెలలకు ఒకమారు మందులు ఇస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా సరిపడా మందులు అందించేందుకు నిధులు విడుదల చేయడం లేనందునే తాము సరైన వైద్యం అందించడం లేదని యశోద ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే సమస్య నెలకొందని కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఎవరైన సమస్యపై ప్రశ్నిస్తే ఉద్యోగ పరంగా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తారని వాపోతున్నారు. జెన్‌కో ఉద్యోగులకు వైద్యం అందించే ఒప్పందం యశోద ఆసుపత్రితో ముగిసినా ఇతర ఆసుపత్రితో ఒప్పందం చేసుకోకుండా వారితోనే అరకొర వైద్యం అందిస్తున్నారని వాపోతున్నారు.

తక్షణమే మరో ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకొని జెన్‌కో ఉద్యోగులకు నిత్యం వైద్య సేవలు అందించడంతో పాటు సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

● సరైన వైద్యం అందించాలి

గత ఆరు నెలల నుంచి మందుల కొరత సమస్య ఉన్నది. ఈగలపెంట ఆసుపత్రిలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని స్థానిక సీఈని కోరామని, సమస్య పరిష్కారం కాకపోతే త్వరలోనే మా యూనియన్ రాష్ట్ర నాయకత్వంతో చర్చించి సమస్య పరిష్కారం కోసం పోరాటం చేస్తాం.

- అశోక్, ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్ ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ కార్యదర్శి

● కార్పొరేట్ వైద్యం అందించాలి

రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో ఉద్యోగులకు స్థానికంగానే కార్పొరేట్ వైద్య సదుపాయాలు అందించాలి. ఈగలపెంట జెన్‌కో ఉద్యోగుల వైద్యం కొరకు ఇటీవల యాజమాన్యం రూ. 1.30 లక్షలు విడుదల చేశారు. ఇక ముందు ఎటువంటి మందుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- లవకుమార్, ఈగలపెంట 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

గోవింద నామస్మరణతో మారుమోగిన గిరులు

- కురుమూర్తి క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం
- జనంతో కిటకిటలాడిన జాతర మైదానం



ఉద్దాలను దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా, భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం ఆదివారం అమావాస్య కావటంతో ఒక్కసారిగా భక్తజనసంద్రంగా మారింది. స్వామి వారిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వా రి రాజగోపురం నుంచి స్వామి కొలువుదీరిన కాంచన గు హ వరకు భక్తులు క్యూలైన్‌లో బారులుతీరారు. మెట్లదారి భక్తులతో కిటకిటలాడింది. దాంతో అడుగడుగునా భక్తుల గోవింద గోవిందా.. కురుమూర్తివాసా గోవిందా.. అంటూ నామస్మరణతో మారుమోగింది.

దుకాణాల్లో జనంతో సందడి

జాతరలో వెలసిన అనేక రకాల దుకాణాల్లోనూ భక్తుల సందడి నెలకొంది. కొనుగోలు దారులతో దుకాణాలు జనంతో కళకళలాడాయి. శని, ఆదివారాలు రెండు రోజులుగా జాతరలో భక్తులు అత్యధికంగా తరలిరావటం విశేషం.

నెలరోజులుగా కొనసాగుతున్న జాతర

కురుమూర్తిస్వామి జాతరకు అమావాస్య రోజుతో నెలరోజులు పూర్తయ్యింది. అయినా జాతర ఇంకా వారం రోజుల పాటుగా కొనసాగనుంది. అయితే అక్టోబరు 31న యాగశాల మండపాలంకరణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, నవంబరు 6న స్వామి వారి అలంకారోత్సవం, 8న ఉద్దాలోత్సవ కార్యక్రమం జరిగింది. అయితే కేవలం ఉద్దాలోత్సవం రోజే మూడున్నర లక్షనమంది స్వామి వారిని దర్శించుకోవటం విశేషం.

ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం అందుకున్న చంద్రశేఖర్‌రెడ్డి, పేట అడిషనల్ ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హుక్

నారాయణపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూర్‌లో జరిగిన 25వ ఆల్ ఇండియా నేషనల్ పోలీస్ లాన్ టెన్నిస్ డబుల్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీలో ఉన్న మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణపేట అడిషనల్ ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హుక్‌లు లాన్ టెన్నిస్‌లో స్వర్ణ పతకం సాధించారు. 50 ఏళ్ల పైబడి న పోలీస్ అధికారులకు నవంబరు 25 నుంచి 30 వరకు బెంగళూర్‌లో జరిగిన పోటీల్లో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టుతో ఆంధ్రప్రదేశ్ జట్టు పోటీ పడగా తెలంగాణ జట్టు విజయం సాధించింది.

ఆర్చరీ టోర్నీలో రవికి స్వర్ణం

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో స్వర్ణం సాధించిన రమావత్ రవి, పక్కన కోచ్ జ్ఞానేశ్వర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు రమావత్ రవి స్వర్ణ పతకం సాధించాడు. టోర్నీలో ప్రతిభ డిసెంబరు 15 నుంచి 20వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని టాటానగర్ జంషెడ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి ఆర్చరీ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు.

జిల్లా కేంద్రంలోని న్యూరిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన పేట క్రీడాకారులు



సిల్వర్ మెడల్ అందుకున్న మౌనిక

నారాయణపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో ఆదివారం జరిగిన పదవ తెలంగాణ సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నారాయణపేట విద్యార్థులు ఒక సిల్వర్ మెడల్, మూడు బ్రౌంజ్ మెడల్ సాధించారని అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు అండర్-12 బాలుర విభాగంలో కే శివకుమార్ వంద మీటర్లు, బ్రౌంజ్ మెడల్స్ 400 మీటర్లు, బాలికల విభాగంలో మౌనిక షాట్ పుట్‌లో సిల్వర్ మెడల్, అండర్-10 విభాగంలో కౌసిక్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు జగదీష్, బీరప్పలు క్రీడాకారులను అభినందించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



వడ్డె శివప్రసాద్(ఫైల్)

బిజినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వడ్డె శివప్రసాద్ (24) ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బిజినేపల్లి గ్రామానికి చెందిన మృతుడు శివప్రసాద్, మరో యువకుడు చీర్ణం మహేష్ యాదవ్‌లు శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఎ దురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన బాధితులను స్థానికులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ శివప్రసాద్ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వాపోయారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని అనుమతుల్లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున బ్లూకోట్ విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్‌బాష, నరసింహలకు భైరాపూర్ నుంచి ఉండవల్లి వైపు వస్తున్న ఓ టిప్పర్ తనిఖీ చేశారు. అనుమతులు లేని ఇసుక ఉండటంతో స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్, శివకుమార్, టిప్పర్ యజమాని విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారిపై బాలుడి అసభ్య ప్రవర్తన

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

తాడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల ఉన్న చిన్నారిపై బాలుడు అసభ్య ప్రవర్తనకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఓ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో చిన్నారిపై బాలుడు అసభ్య ప్రవర్తనకు పాల్పడ్డట్టు సమాచారం. ఇందుకు సంబంధించి చిన్నారి తల్లిదండ్రులు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ఆ బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలున్ని సోమవారం జూనియర్ కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లమల నుంచి తప్పి వచ్చిన సాంబార్

● అటవీ అధికారులకు అప్పజెప్పిన సోమశిల గ్రామస్థులు



సాంబార్‌ని అధికారులకు అప్పగిస్తున్న సోమశిల గ్రామస్థులు

కొల్లాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ రేంజ్ అటవీ ప్రాంతం సోమశిల ఫారెస్టు నుంచి ఆదివారం దారి తప్పి గ్రామానికి వచ్చిన సాంబార్‌ని కుక్కల భారీ నుంచి గ్రామస్థులు కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. సోమశిల గ్రామస్థులు, అటవీ అధికారులు సాంబార్‌ని వెటర్నరీ సిబ్బంది పాషాఖాన్ దగ్గర చికిత్స చేయించి తిరిగి సోమశిల అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.

సాంబార్‌కి ఎలాంటి ప్రాణపాయం లేదని అటవీ శాఖ, ముజీబ్ ఘోరి తెలిపారు. గ్రామస్థులు సహకరించడంతో సాంబార్ కుక్కల భారీ నుంచి కాపాడామని ఆయన తెలిపారు. అటవీ సిబ్బంది వెంకటయ్య, నిరంజన్, నాగమల్లి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోడేరు/లింగాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం ధారారం గ్రామం నుంచి లింగాల వెళ్తున్న బైకు లింగాల నుంచి ధారారంకు వస్తున్న బైకు రెండూ ఢీకొనగా ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కోడేరు మండల కేంద్రానికి చెందిన కురువ యలాల నాగ మల్లయ్య(48) గొర్రెల మేపు కోసం లింగాల కొండనాగుల ప్రాంతాలలో వలస వెళ్లగా ఆదివారం నాగ మల్లయ్య బైక్‌పై ధారారం వైపు నుంచి లింగాల వెళ్తున్నాడు.

ఈ క్రమంలో లింగా ల వైపు నుంచి వస్తున్న బైకు ఢీకొనగా మల్లయ్య తలకు బలమైన గాయం తగిలిందని, మిగతా ఇద్దరికి కూడా దెబ్బలు తగిలాయని అన్నారు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని తెలిపారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

సామాజిక చైతన్యంతో సహిత్యం సుసంపన్నం

- ప్రసిద్ధ రచయిత డాక్టర్ నాళేశ్వరం శంకరం



మాట్లాడుతున్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కవులు రచయితల్లో సామాజిక అస్తిత్వ చైతన్యం ఉంటేనే వారు వెలువరించే సాహిత్యం సుసంపన్నమవుతుందని ప్రసిద్ధ రచయిత, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాహితీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాహిత్యం- సమాజం అనే అంశంపై సుదీర్ఘంగా ఉపన్యసించారు. సాహిత్యంలో పాటకు ప్రత్యేక స్థానం ఉందని, ఉద్యమకారుని పాట సమాజాన్ని చైతన్యవంతం చేసే సినీ పాటలు వినోదాన్ని మాత్రమే కలిగించి ప్రజల జేబులని గుల్ల చేస్తాయని అన్నారు. ప్రస్తుతం దేశం కుంపట్లో మండుతోందని, సాహితీవేత్తలు తమ గుండె గొంతుకలో సమాజం కోసం కొట్లాడి వారిని మేల్కొల్పాలని ఆయన సూచించారు. సాహితీవేత్తలు కేవలం కవితల వరకే పరిమితం కాకుండా వివిధ సాహిత్య ప్రయత్నాల్లో విశ్లేషణాత్మక వివరణాత్మక అంశాలతో సాహిత్య సేద్యాన్ని సుసంపన్నం చేయాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, ఉపాధ్యక్షుడు అనంతోజు మోహన కృష్ణ తదితర వక్తలు సూచించారు. ప్రసిద్ధ గజల్ వెంకటేశ్వర శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ సాహితీ మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పోలు యాదయ్య, కార్యదర్శి నివేదికను చదవగా, నాగర్‌కర్నూల్ జిల్లా నివేదికను డాక్టర్ భానుచందర్ చదివి వినిపించారు.

కవి సమ్మేళనానికి ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షత వహిం చగా, తెలంగాణ సాహితీ నాగర్‌కర్నూల్ జి ల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ వహీద్ ఖాన్ నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన 45 మంది కవులు వివిధ సామాజిక అంశాలపై తాము రచించిన కవిత్వాన్ని కవి సమ్మేళనంలో వినిపించి ఆహూతులను అలరించారు. తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు మైనొద్దీన్, కొప్పోలు యాదయ్య, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోదుకుమార్, వనపర్తి జిల్లా తెలంగాణ సాహితీ కార్యదర్శి రాజారాం ప్రకాష్, ప్రముఖ విద్యావేత్తలు సురభి జగపతిరావు, భాస్కరయ్య, ప్రసిద్ధ కవులు పొద్దుటూరు ఎల్లారెడ్డి, వనపట్ల సుబ్బయ్య, వెన్నెల సత్యం, వైద్యం భాస్కర్‌తో పాటు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా



బాధితుల నుంచి వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం/అయిజ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చీరాని వైద్యంతో.. కాసులకు కక్కుర్తి పడి... ఓ మహిళ ప్రాణం తీసి ముగ్గురు చిన్నారులను తల్లిలేని పిల్లలుగా చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని... ఆదివారం మృతి చెందిన మహిళ బంధువులు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఇందుకు సంబంధించి మృతురాలి భర్త జమ్మన్న, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అయిజ మండల కేంద్రానికి చెందిన మృతురాలు కవితకు ముక్కులో గడ్డలు ఉన్నాయని, ఆమె భర్తతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అయితే అక్కడ ఉన్న ఓ డాక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాలు లేవని, కర్నూల్, లేదా హైదరాబాద్ వెళ్లాలని సూచిస్తూనే.. మీకు తక్కువ ధరలో రూ. 20వేలతో మా ఆసుపత్రిలో చేస్తానని చెప్పాడు. మేము పేదవారిమి అంత ఇచ్చుకోలేమని చెప్పగా చివరకు రూ. 15వేలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే మంగళవారం వారు ఆ డాక్టర్‌కు సంబంధించిన ప్రైవేట్ ఆసుపత్రికి రాగా ఎలాంటి పరీక్షలు చేయకుండానే వెంటనే మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో కవితకు ఫిట్స్ వచ్చి అలాగే కోమాలోకి వెళ్లింది. అయితే ఈ విషయాన్ని బాధితులకు చెప్పకుండా పరిస్థితి విషమించిందని వెంటనే వారే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె కోమాలో ఉన్న విషయం తమకు చెప్పకుండా దాచారని, అయితే కర్నూల్‌కు వెళ్లాక వారు కోమాలోకి వెళ్లిందని, మా ప్రయత్నం చేస్తామని చెప్పారని బంధువులు తెలిపారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో వచ్చి గద్వాల జిల్లా కేంద్రంలోని మత్తు ఇంజక్షన్ వేసిన ప్రైవేట్ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. కవిత మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి పరిస్థితి మరెవరికి రాకూడదని మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ధర్నా సమయంలో మృతురాలి అత్త స్పృహ కోల్పోయింది. విషయం తెలిసిన పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ బాధితులకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోమవారం పోస్టుమార్టం రిపోర్ట్ వస్తుందని, దాని ఆధారంగా అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ధర్నా విరమించేలా చేశారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా, అయిజ పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఉన్న నిరుపేద కుటుంబం కవితది. భర్త జమ్మన్నతో కలిసి ఆటోతో వివిధ గ్రామాలు తిరుగుతూ చిన్నపాటి ఉల్లిగడ్డలు, కూరగాయల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. కవితకు విశాల్, సుశాంత్, వరుణ్ ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా, చిన్న కొడుకు అంగన్‌వాడీ పాఠశాలలో చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

న్యూస్ బాక్స్

'రైతన్నలకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న సీఎం'

వంగూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు పెద్దన్నగా ఉండి పాలన సాగిస్తున్నారని వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు ప్రభుత్వం రూ.18వేల కోట్ల రుణమాఫీ చేసిందని, పాలమూరులో జరిగిన రైతు పండగ సభలో మరో రూ.3వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. మూడు రోజుల పాటు జరిగిన రైతు పండగ విజయవంతమైందన్నారు. రైతు కమిషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో లాభసాటి వ్యవసాయం, గిట్టుబాటు ధర, కల్తీ విత్తనాలు అరికట్టడం, భూసారం పెంపు, మార్కెటింగ్‌తో పాటు కేంద్ర నిధులు తీసుకొచ్చే అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పురుసుల సాయికుమార్‌కు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును ఆదివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.

మంత్రులు క్షమాపణ చెప్పాలి

- బీఆర్‌ఎస్ దళిత నాయకులు

కోడేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రులు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని, మీకు దమ్ముంటే ఆధారాలు చూపించాలని బీఆర్‌ఎస్ పార్టీ దళిత నాయకులు యాపదిన్నె లాలు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకులాల బాట అనగానే కాంగ్రెస్ పార్టీ మంత్రులకు గుండెల్లో రైళ్లు పెరిగెత్తుతున్నాయని అన్నారు. తమ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

నిప్పంటుకొని గడ్డి వాము దగ్ధం

పెంట్లవెల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిప్పంటుకొని గడ్డి వాము దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు మేకల రామకృష్ణ తెలిపిన కథనం ప్రకారం.. పెంట్లవెల్లి గ్రామానికి చెందిన మేకల రామకృష్ణ తన పశువుల కోసమని కల్లం దొడ్డిలో గడ్డివామును ఏర్పాటు చేసుకున్నాడు. సాయంత్రం 6గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివాము దగ్ధమవుతుండగా అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయగా వారు బండి రిపేరులో ఉందని చెప్పడంతో స్థానికంగా ఉండే వాటర్ ట్యాంకర్ల ద్వారా మంటలు ఆర్పారు. దాదాపు రూ. 30వేల ఆస్తి నష్టం జరిగిందని వారు వాపోయారు.

హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొట్టాలి

మన్ననూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవితాల నుంచి హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొట్టాలని డాక్టర్ ఓ.భరత్ పిలుపునిచ్చారు. ఆయన ఎయిడ్స్ డే సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని మాచారం గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. సుఖవ్యాధులు ఎలా సంభవిస్తాయో, అవి రాకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై ప్రజలకు పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అంజమ్మ, జ్యోతి, గ్రామస్థులు ఉన్నారు.

రోడ్డుపై గుంతలు

- మట్టి పోసి పూడ్చిన బీజేపీ నాయకులు



గుంతల్లో మట్టిని పోసి పూడుస్తున్న బీజేపీ నాయకులు బండెల రామచంద్రారెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండల పరిధిలోని కుర్మిద్ద, సమీపంలో కుర్మిద్ద-మాదారంలో కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో బీజేపీ సీనియర్ నాయకులు బండెలరామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డిలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టి మొర్రం పోసి పూడ్చారని తెలిపారు. రోడ్డుపై రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో మొర్రం పోయడం జరిగిందని బండెల రాంచంద్రారెడ్డి తెలిపారు.

వరి కొనుగోలు చేయాలి

లింగాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హమాలీలను ఏర్పాటు చేసి వరి కొనుగోలు చేయాలని అంబటిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అచ్చుతారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. అంబటిపల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారే తప్ప రైతుల నుండి వరి మాత్రం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రంలో హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వడ్లను కేంద్రం దగ్గరకు తీసుకుని రావాలంటేనే రైతులు భయపడుతున్నారు. హమాలీలు లేనందున వడ్లు తూకం వేయడం ఆలస్యమవుతుందని, ఎవరూ కూడా సొసైటీ ఏర్పాటు చేసిన కేంద్రం దగ్గరకు వడ్లను తీసుకురావడం లేదన్నారు. రైతుల సంక్షేమం కొరకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నాలకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ప్రకటించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ రైతులు పాల్గొన్నారు. అంబటిపల్లి సింగిల్ విండో సీఈవో పాండును వివరణ కోరగా రైతుల నుండి వరి కొనుగోలు సాగుతుందని తెలిపారు. హమాలీల సమస్య పరిష్కరించామని రైతులు వరి కొనుగోలు కేంద్రాల వద్దకే నాణ్యమైన వరిని తీసుకు రావాలని సూచించారు.

ఐతోల్ మండలమయ్యేనా..?

- కలెక్టర్, ఎమ్మెల్యేను కోరిన గ్రామస్థులు
- భూమి ఇచ్చేందుకు ముందుకొచ్చిన ఎస్‌వీఎస్ హాస్పిటల్ అధినేత రాంరెడ్డి, కృష్ణారెడ్డితో పాటు దర్శకుడు నాగ్ అశ్విన్
- ఐతోల్ పరిసర గ్రామాల ప్రజల ఎదురుచూపు



ఐతోల్ గ్రామ వ్యూ

తాడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐతోలు.. ఈ ఊరు తాడూరు మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీ. ఇప్పుడిన్న తాడూరు మండల కేంద్రం కొన్ని గ్రామాలకు దూరంగా ఉండటంతో ఐతోలును మండల కేంద్రం చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది.

గత ఆగస్టులో గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్ బదావత్ సంతోష్, దర్శకుడు నాగ్ అశ్విన్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు హాజరయ్యారు. ఆ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐతోల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎస్‌వీఎస్ హాస్పిటల్ అధినేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డిలు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమిని తమ కుటుంబం, నాగ్ అశ్విన్ కుటుంబం సమకూర్చుతుందని సమావేశంలో స్పష్టం చేశారు. మండలం ఏర్పాటుకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హామీ ఇవ్వాలని కోరగా, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

వ్యాపార సముదాయాలు..

మండల కేంద్రానికి అనువుగా ఉన్న ఐతోల్ గ్రామం నుంచి ఎన్‌హెచ్ రోడ్డు ఉన్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై, ఐతోల్ గ్రామం నుంచి ఇటు నంద్యాల హైవేకు అటు జడ్చర్ల, వనపర్తి హైవేకు రోడ్డు మార్గం ఉంది. గ్రామంలో భారతీయ స్టేట్ బ్యాంక్, విద్యుత్ సబ్ స్టేషన్, తపాలా కార్యాలయం, రైతు ఆగ్రో సేవా కేంద్రాలు, పెట్రోల్ బంకులు వంటి అన్ని సముదాయాలు ఉన్నాయి. ఐతోల్‌కు పది కిలో మీటర్ల దూరంలోనే పాపగల్, సిర్సవాడ, ఐతోల్, బలాన్‌పల్లి, గోవిందాయపల్లి, ఎటిధార్‌పల్లి, అంతారం, అల్లిరాంతండా, తుమ్మలసూగూర్, పర్వతాయిపల్లి తదితర 15 గ్రామాలు అందుబాటులోకి వస్తాయని, అందువల్ల నూతన మండల కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పలువురు ప్రముఖులు

ప్రస్తుతం ఐతోల్ గ్రామంలో 1729 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామంలో ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ జయంతి, ప్రముఖ కిడ్నీ స్పెషలిస్టు డాక్టర్ జయరామిరెడ్డితో పాటు మహబూబ్‌నగర్‌లో ఉన్న ఎస్‌వీఎస్ హాస్పిటల్ అధినేతలైన కృష్ణారెడ్డి, రాంరెడ్డితో పాటు మరింత మంది ప్రముఖులు ఈ గ్రామస్థులే.

మండల కేంద్రానికి అన్నీ వనరులు



ఐతోల్‌ను నూతన మండల కేంద్రం చేయ దానికి గ్రామంలో అవసరమైన అన్ని వనరులు గ్రామ పెద్దల సహాయ సహకారంతో సమకూర్చుకుంటాం. మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఐతోల్ గ్రామం మరింత అభివృద్ధి చెంది చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

- లక్ష్మయ్య, ఐతోల్ గ్రామం

పరిసర గ్రామాలకు ఎంతో మేలు



ప్రస్తుతం మండల కేంద్రమైన తాడూరు దూరంగా ఉండడం వల్ల అక్కడికి వెళ్లేందుకు బస్సు సదుపాయం లేదు. ఐతోల్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాడూరు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఐతోల్‌ను మండల కేంద్రం చేయాలి.

- అబ్దుల్లా, మాజీ కోఆప్షన్ సభ్యుడు

దేవతావృక్షాల వద్ద కార్తీక దీపారాధన



పాలెంలో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో దేవతా వృక్షాలకు దీపారాధన చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ఆరోగ్యవరంగా, ఆర్థికంగా ఉపయోగపడుతున్న వృక్షాలను దేవతా మూర్తులుగా భావించిన భక్తులు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేస్తున్నారు. మండలంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని జమ్మి, బిల్వం, జిల్లేడు, రావి, వేప, ఉసిరి వృక్షాలతో పాటు మందార, తులసి, కలమంద, ఆరటి, గన్నేరు, గరక, తమలపత్ర వంటి మొక్కలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలోని ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు, దీపారాధన చేపట్టారు. భక్తులు పూలు, పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయప్రధాన అర్చకులు వెల్దండ సురేష్‌శర్మ తెలిపారు. కుమ్మెర గ్రామానికి చెందిన పద్మమ్మ, కృష్ణారెడ్డి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. లక్ష్మణ్,ఆలయకమిటీసభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ



తిమ్మాజిపేటలో పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

తిమ్మాజిపేట : మండల కేంద్రంలో ఆదివారం ఆంజనేయస్వామి పల్లకిసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అఖండ భజనలు చేశారు. భక్తులు ఆంజనేయ స్వామిని తిమ్మాజిపేటలో భజనలు చేస్తూ స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ లీలావతి, శివాంజనేయ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, దాచేపల్లి వేణుగోపాల్, మురళీ, కోటేశ్వర్‌రావు, బాలరాజు, శాంతయ్య, రాము పాల్గొన్నారు.

మైసమ్మ దర్శనం

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులోని మైసమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అమావాస్య ఉండడంతో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి తక్కువ సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయానికి మొత్తం రూ. 72,180 ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వర్‌శర్మ, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనం పెంచాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న



ఐతోల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, మధ్యాహ్న భోజన కార్మికులు

తాడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.24వేల వేతనం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్ పేరుతో కార్మికులను తొలగించడం సరికాదని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన కోరారు. మండలంలోని ఐతోల్ గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల నుంచి పెండింగ్ బిల్లులు పారితోషికం, పెండింగ్ బిల్లులు రావడం లేదని, మధ్యాహ్న భోజనం బిల్లులు రావడం లేదని కార్మికులు అప్పులు చేసి కిరాణాషాపులో డబ్బులు కడుతున్నారని బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, సుగుణమ్మ, అంజనమ్మ, సైదాబేగం, సుగుణమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పాపూర్ మెటల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో చెంచు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్ / ఉప్పునుంతల/ అచ్చంపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయారణ్య ప్రాంతంలోని అప్పాపూర్‌పెంట వరకు మెటల్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. నల్లమల ప్రాంతంలోని చెంచుల స్థితిగతులను తెలుసుకునేందుకు ఆమె స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. శ్రీశైలం దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఆమె వర్షాపూర్ దృశ్యకేంద్రాన్ని సందర్శించి ప్రకృతి అందాలను తిలకించారు. అనంతరం అప్పాపూర్ పెంటకు వెళ్లారు. అక్కడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చెంచులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు డాక్టర్ అనురాధ, ఉమామహేశ్వర పాలకమండలి డైరెక్టర్ సంబు శివ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అచ్చంపేటటౌన్/ ఉప్పునుంతల : మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి అచ్చంపేట మండలంలోని ఐనోల్ గ్రామం వరకు రూ.4 కోట్ల 50 లక్షలతో మంజూరైన బీటీ రోడ్డుకు ఆదివారం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి (ధనసరి అనసూయ) సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. అదే విధంగా అచ్చంపేట మండల పరిధిలోని చెన్నారం నుంచి కస్తూరితండా వరకు రూ.1కోటి 50 లక్షల బీటీ రోడ్డుకు ఎమ్మెల్యేతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ జిల్లెల జగన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

కల్వకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత జాగృతి వ్యవస్థాపకురాలు ఎమ్మెల్సీ కవితను మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. 8న తలకొండపల్లిలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరినట్లు తెలిపారు.


కొల్లాపూర్ ఇన్‌చార్జ్‌గా రాకూర్ బాలాజీసింగ్

కల్వకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాల కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కల్వకుర్తికి చెందిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ రాకూర్ బాలాజీసింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నుంచి నియామక పత్రం వెలువడింది. ప్రజాపాలన విజయోత్సవాల కొల్లాపూర్ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు పీసీసీ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బాలాజీసింగ్ తెలిపారు.మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణారావుతో చర్చించి తనకు కేటాయించిన పనులను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన చెంచులు

పదర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ పరిధిలోని ఆటవీశాఖ అధికారుల చేతిలో దాడికి గురైన మండలంలోని చిట్లంకుంట గ్రామానికి చెందిన చెంచు గిరిజనులు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఆదివారం కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. అంతే కాకుండా రిమాండ్ అనంతరం బెయిల్ వచ్చిన తమపై పారెస్టు అధికారులు దాడులు చేసినట్లు వినతి అందించారు. వెంటనే స్పందించిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో చెంచుల సమస్యను పరిష్కరించేలా చూడాలని తెలిపారు. బాధిత చెంచులు మండ్లి వీరయ్య, అంజయ్య, లింగయ్య, మల్లయ్య, ఈదయ్య ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన మాలలు



నాగర్ కర్నూల్ నుంచి తరలివెళ్తున్న మాల ఉద్యోగులు, మాల ప్రజలు

కందనూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన సభకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి మాలల ఉద్యోగుల సంఘం నుంచి మాలల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన గోవర్ధన్ జెండా ఊపి హలో మాల చలో హైదరాబాద్ బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవ జిల్లా ప్రెసిడెంట్, లెక్చరర్ కందూరి కృష్ణయ్య అర్బనైజింగ్ సెక్రటరీ సామ రమేష్, కొత్త దికారి ప్రభాకర్, సభ్యులు కుర్మయ్య, చెన్నయ్య, బాలరాజు, శేషగిరి, శేఖర్, డాక్టర్ శంకరయ్య, సంకీర్తన, టీనాగయ్య, రామకృష్ణ, శివకుమార్, తిరుపతయ్య పాల్గొన్నారు.

తరలివెళ్లిన మాలలు

అచ్చంపేటటౌన్ : హైదరాబాద్‌లో జరిగిన మాలల సింహగర్జన సభకు అచ్చంపేట నియోజకవర్గం పెద్ద ఎత్తున మాలలు తరలివెళ్లారు. అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సభకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు డివిజన్ నాయకులు అంజనేయులు, నాయకులు రామనారాయణ, కుంద మల్లికార్జున్, లింగస్వామి, రవి, శ్రీశైలం, ఆనంద్, రాజేష్, బాలస్వామి, అంజనేయులు, రవీందర్, జీవన్‌కుమార్, జనార్ధన్, నాసరయ్య వెంకటేష్, పాండు, శ్రీనివాసులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మాలలు వాహనాలలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

బాలమల్లేశ్ మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, వార్డ వెంకటయ్య
- ఘన నివాళి అర్పించిన నాయకులు



కందనూలులో బాలమల్లేశ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

కందనూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, వార్డ వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా దగ్గర ఎన్.బాలమల్లేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో ఏ పని అప్పజెప్పినా వీరసైనికుడిగా పనిని స్వీకరించి పూర్తి చేసేవారని అన్నారు. ప్రజా సంఘాలు, పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన బాలమల్లేశ్ తన జీవితం మొత్తాన్ని పార్టీకే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మధు శివశంకర్, ఎన్ఎఫ్‌డబ్ల్యూ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కందూరి వెంకమ్మ, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణాజీ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వీరవీందర్, సీపీఐ నాయకులు కిలివాయి గోపీచారి, కొత్త రామస్వామి, కొల్ల శేఖర్, కృష్ణయ్య, మల్లయ్య, రాములు పాల్గొన్నారు.

బాలమల్లేశ్‌కు ఘన నివాళి

పెద్దకొత్తపల్లి : గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి పెద్దకొత్తపల్లి అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఉమ్మడి జిల్లా నాయకులు కందాల రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ్ల యేసయ్య, సీపీఐ మండల కార్యదర్శి బుల్లెద్దుల శ్రీనివాసులు, లక్ష్మయ్యస్వామి, మద్దిలేటి, ప్రకాష్, సా యిలు, శ్రీలింగౌడ్ పాల్గొన్నారు. దేవునితిర్మలాపూర్ గ్రామంలో సీపీఐ నేత బాలమల్లేశ్ మృతికి ఘన నివాళి అర్పించారు. పార్టీ నాయకులు కేశవేట రాములు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



చెన్నపురావుపల్లిలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న అమరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని మండలంలోని చెన్నపురావుపల్లి గ్రామంలో ఆది వారం మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. గ్రామంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మాజీ సర్పంచ్ చెంది వెంకటస్వామి, కార్యదర్శి అంకి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు పుట్టశాలి, మాజీ అధ్యక్షుడు ఈశ్వరయ్య నాయకులు పొనాలి వెంకటస్వామి, మండల చంద్రయ్య ఉన్నారు.

చెన్నారంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సంస్థ సభ్యులు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో ఆదివారం ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. క్యాంపులో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి చెకప్ చేసి మందులు ఇచ్చామని సత్య సాయి సేవా సంస్థ సభ్యులు మల్లారెడ్డి, సాయిరాం తెలిపారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీనెల మొదటి ఆదివారం ఉచిత వైద్య క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రజా పాలనపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కల్వకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర ఎస్సీపీఎ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రజాపాలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌డబ్ల్యూవో కృష్ణయ్య తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు వివరించడంతో పాటు హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, కిరణ్, కర్ణయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు

తెలకపల్లి : తొమ్మిది రోజుల సంబరాల్లో భాగంగా ఆదివారం ఎడ్యుకేషన్ డే నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఫునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు నుఅందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఎల్లగౌడ్, వెంకటేశ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్

చారకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని చంద్రాయన్‌పల్లిలో బీజేపీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి అభివృద్ధి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బూత్ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు కొండల్, శ్రీను, లక్ష్మయ్య, యాదయ్య, వెంకయ్య, అంజి పాల్గొన్నారు.

మహాత్మా మన్నించు..



పదరలో చేయి విరిగిన గాంధీ విగ్రహం

పదర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతిపితగా పిలుచుకునే మహాత్మాగాంధీ విగ్రహం కర్ర పట్టుకునే చేయి విరిగింది. మండల కేంద్రంలో మద్దిమడుగు ప్రధాన రహదారి పక్కన దర్శనమిస్తుంది. ప్రజలందరితో పాటు నాయకులు, అధికారులు నిత్యం ఆదే దారిలో వెళ్తున్నా విగ్రహం దుస్థితిని పట్టించుకునే నాథుడే కరువు. ఇది చూస్తున్న దేశభక్తులు మహాత్మా మన్నించు.. అని తలదించుకునే పరిస్థితి. 4 ఫిబ్రవరి 2004 సంవత్సరంలో క్రీడా శాఖ మంత్రిగా ఉన్న పోతుగంటి రాములు ప్రారంభించారు. అప్పట్లో శ్రీ సీతారామయ్య మెమోరియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.మదన్ మోహన్ రావు విగ్రహదాతగా ఉన్నారు. ప్రస్తుతం విగ్రహం శిథిలావస్థకు చేరడంతో కాలేజీ ఉంది. దాతలు ముందుకొచ్చి సహకరిస్తే విగ్రహం పునఃప్రతిష్ఠ చేద్దామని జి.మదన్ మోహన్ రావు కోరుతున్నారు.